# పొరపొచ్చాలు

యస్. పురుషోత్తమాచార్య




"ప్రక్కింట్లో మళ్ళీ ఏదో గొడవ మొదలయినట్లుంది" అన్నాడు శ్రీనివాసమూర్తి.

"ఆ! అరగంట క్రితవే మొదలెట్టారు. ఈ మొగుడూ పెళ్ళాల మధ్య యిలాంటి తగవులుంటాయని తెలిసినప్పటినుంచీ పెళ్ళంటేనే డోకు పెట్టుకొస్తోంది" అంటూ లేచేడు శ్రీకాంత్.

"యింతకీ అసలు విషయవేవిటో తెలుసా? ఆయనగారు ఆఫీసునుంచి వచ్చేపుడు కాఫీపొడిని కొనుక్కురావటం మరిచిపోయేడట!"

"ఆ కాఫీ విషయం అలా వదిలేయ్! గృహావసరమైన చిన్న చిన్న వస్తువుల సేకరణలోని జాప్యం దంపతులమధ్య ఎన్నో సమస్యలని సృష్టిస్తోంది. ఈ

సమస్యల చిచ్చుబుడ్లు అలా వెలుగుతూ వుంటయ్! యిలా ఆరిపోతుంటయ్! కాని ఈ మధ్య నున్న సమయంలో ఆ దంపతుల మధ్య మనస్తాపానికి మాత్రం లోటు వుండదు.

"దంపతుల మధ్య సమస్యలనే సరికి జ్ఞాపకం వచ్చింది. యిదో ఈ 'యువ' లో చీపురుకట్టలకోసం ఓ జంట పడిన బాధల్ని గురించి కథ వ్రాసేరు చూడు! యిరవై రెండో పేజీ!" అంటూ పత్రికని శ్రీకాంత్ వంక విసిరి బాత్‌రూంలోకి వెళ్ళేడు శ్రీనివాసమూర్తి.

శ్రీకాంత్ పుస్తకం తెరిచి కథని చదవటం ప్రారంభించేడు.

* * *

"అమ్మగోరూ! సీపురు సిన్నదై పోయిందండీ! కొత్తకట్ట కొనుక్కొస్తాను డబ్బులివ్వరూ?" అంటూ గోదవారగా నుంచునిపోయింది రామి

"అబ్బ! తరవాత చూద్దాంలేవే! నాకు టైమయిపోతోంది. మరో ప్రక్క వీధిలోంచి ఆయన కేకలు!" తల దువ్వుకుంటున్న పరిమళ విసుక్కుంది.

రామికూడా లోలోన విసుక్కుంది. చీపురుకట్ట పూర్తిగా పొట్టిదయిపోయి ఆ జానెడు పొడుగుతో యిల్లంతా తుడుస్తోంటే దానికి నడుంలో నొప్పి పుడుతోంది. గత పదిహేను రోజులుగా కొత్త కట్టని కొనవలసిందిగా పరిమళని హెచ్చరిస్తోనే వుందది.

వీధిలో స్కూటర్ పైనున్న ప్రకాశరావులోని ఓర్పు నశించింది.

"పరిమళా!" గావుకేక వేసేడతను.

తల దువ్వుకుని సింగారాన్ని పూర్తి చేసుకుని గాని వీధిలోకి రాలేదు పరిమళ.

"యిలా అవుతే రేపట్నుంచి వెళ్ళేపుడు కూడా రిక్షాలో వెళ్ళు! నేను వెళ్ళాల్సిన దూరం గురించి పట్టింపే లేదు నీకు! ఎందుకంత సింగారం? సింపుల్‌గా వెళ్ళలేవూ?" విసుక్కుంటూ స్కూటర్ని స్టార్ట్ చేసేడు ప్రకాశరావు.

"అమ్మగారూ! డబ్బులిచ్చెళ్ళరూ?" చేతిలోని పొట్టి చీపురుతో పరుగెడుతూ వచ్చింది రామి

"సాయంత్రం చూద్దాంలేవే! వెళ్ళేపుడు అపద్దని ఎన్నిసార్లు చెప్పాలి నీకు?" అరిచింది పరిమళ.

దుమ్ము రేపుకుంటూ వెడుతూన్న ఆ స్కూటర్ వంకోసారి కసిగా చూచి చేతిలోని పొట్టిచీపుర్ని నేలకి విసిరికొట్టింది రామి.

సాయంకాలం పరిమళా, ఆవిడ స్నేహితురాలు పద్మజా కలిసి వచ్చేరు. ముందుగదిలోకి అడుగిడటంతోనే లోన మొండిచీపురుతో గదిని చిమ్ముతూన్న రామి కనిపించింది వారికి. పద్మజ, దాని చేతిలోని మొండిచీపురును చూడటంతోనే పరిమళ వంక వింతగా చూచింది.

ఆ చూపుని భరించలేక తలదించుకుంది పరిమళ.

"వెధవది! రోజూ కొత్తచీపుర్ని కొనుక్కొద్దామనే అనుకుంటున్నాను గాని ప్రతిరోజూ మరిచేపోతున్నాను" రాని నవ్వుని మొహంమీద పులుముకుని వంట గదిలోకి దారితీసింది పరిమళ.

"పరిమళా! పోయినసారి పూల గుత్తుల్లావున్న చీపురొకటి కొన్నాను. మూణ్ణెల్లు దాటింది. యింకా చెక్కుచెదర లేదు." అంటూ ముక్కాలిపీటపైన చేర గిల బడిపోయింది పద్మజ

"ఎంతయిందేవిటి? అలాంటివో రెండు తెచ్చి యింట్లో పడేస్తేగాని నాకు మా రామితో పోరు తప్పదు. రోజూ నా ప్రాణం తీస్తోందది." కాఫీని కలుపుతూ పలికింది పరిమళ.

"రెండురూపాయల కొహటను కుంటాను. యిపుడు మరో పావలో పరకో అదనం కావచ్చు. మార్కెట్ కెళ్ళినపుడు నీవే తీసుకుని రారాదూ? పనిమనిషికిస్తే అంతో యింతో తస్కరం తప్పదు." అంటూ కప్పునందుకుంది పద్మజ

"అమ్మగోరూ యిక ఈ సీపురుతో నే తుడవలేనండీ! నా నడుం పడి పోయింది. డబ్బివ్వండి! పొద్దునొచ్చే పుడు కొని పట్టుకొస్తాను." ఆ సాయం కాలం వేళ రామి కళ్ళలోని విసుగుని స్పష్టంగా చదవగలిగింది పరిమళ. కాని ఆవిడకు పద్మజ సూచించిన పూలగుత్తుల చీపుర్లు కొనుక్కురావాలన్న ఆలోచన మనసులో వుంటంతో రామిని అనున యించింది.


"రామీ! ఈ ఒక్కపూటకు గడవ నివే! రేపు సాయంత్రం వచ్చేపుడు కొత్తరకం చీపుర్లు రెండు పట్టుకొస్తాను. చాలా కాలం మన్నుతాయవి. యిప్పటికి ఊరుకుందూ!" అంటూ దాన్ని సాగ నంపింది పరిమళ.

పరిమళకి స్టేట్ బ్యాంకులో ఉద్యోగం మర్నాడు రోజంతా కూడా క్షణం తెరిపి నివ్వని పని వొత్తిడిలో అలసిపోయిం దామె. అయినా కూడా ఆవిడకి చీపురు కట్టల్ని కొనుక్కెళ్ళాలన్న ధ్యాసమాత్రం లేకపోలేదు.

సాయంకాలం మార్కెట్ కెళ్ళే బస్సు కోసం పడిగాపులు కాయసాగిందామె. ఒక్క బస్సులోనూ ఆవిడకి స్థలందొరికే సూచనలు కనిపించలేదు. బస్సులన్నీ చాలా వరకు ఆవిడ నుంచున్న స్టాపులో ఆగకుండానే దూసుకెళ్ళసాగేయి. సాయంకాలం ఏడుదాకా బస్సుకోసం ప్రయత్నించి ఫలితం లేకపోవటంతో విసిగి రిక్షాలో యిల్లు చేరుకుందామె.

బోసి చేతులతో యిల్లు చేరిన అమ్మ గారిని చూస్తూనే రామి మొహం కాస్తా చిన్నవోయింది.

"నాకు వీలుపడలేదే రామీ! యిహ నీవే వెళ్ళి తీసుకురా! పూలగుత్తుల్లా వుండే చీపుర్లేవో మార్కెట్లోకి కొత్తగా వచ్చేయట. అలాంటివో రెండు పట్రా!




దబ్బిస్తాను." అంటూ పడగ్గదిలోకెళ్ళింది పరిమళ. కాని గదిలో దుస్తులు మార్చు కుంటూన్నపు డావిడకి పద్మజ పలుకులు జ్ఞాపకం వచ్చేయి.

"రామికిస్తే రెండు చీపుర్లకి కలిపి ఓ రూపాయన్నా కాజేస్తుందో ఏమో? ఎందుకొచ్చిన బెడద? రేపాయన్ని వచ్చే పుడు స్కూటర్‌పై వేసుకురమ్మంటే సరి!" అనుకుంటూ బాత్‌రూంలోకెళ్ళిం దామె.

"అమ్మగోరూ! డబ్బులివ్వరూ?" యింటికెళ్ళబోతూ పలికింది రామి.

"వద్దులేవే! నీ కలాంటివి తెలుసో లేదో? రేపు అయ్యగార్ని వచ్చేపుడు కొని స్కూటర్ మీద వేసుకురమ్మం టాను. నీ వెళ్ళు!" అంటూ బీరువా తలుపుల మధ్య మొహాన్ని దాచుకుంది పరిమళ.

మౌనంగా వీధిలోకి వెళ్ళిపోయింది రామి.

ఆ రాత్రే రెండో ఆట సినిమా ప్రోగ్రాం వేసేడు ప్రకాశరావు. ఆ సందడిలో భర్తకి ఆ విషయం చెప్పటవే మరిచిపోయింది పరిమళ. కాని మర్నాడు కాదుగదా మరో వారందాకా కూడా ఆవిడకావిషయవే జ్ఞాపకం రాలేదు.

ఆ రోజు ఆఫీసుకెళ్ళేపుడు వీధిని తుడుస్తూన్న మనిషినొకర్ని చూచేసరికి పరిమళ బిర్ర బిగుసుకుపోయింది. గత వారం రోజులుగా రామి తనకి మళ్ళీ చీపురుకట్టల్ని గురించి జ్ఞాపకం చేయక పోవటంతో అది తనని అవమానం చేసి నట్లుగా తోచిందామెకి. దాంతో ఆవిడకి రామిపై ఎనలేని కోపం ముంచుకొచ్చింది.

స్కూటర్ బ్యాంకుముందు ఆగగానే సాయంకాలం వెళ్ళేపుడు ఓ రెండు చీపురుకట్టల్ని కొనుక్కెళ్ళవలసిందిగా భర్తని కోరింది పరిమళ. ఏ కళన వున్నాడో కాని ప్రకాశరావందుకు

వెంటనే అంగీకరించి తన వాహనాన్ని కాస్తా ముందుకు పోనిచ్చేడు.

ఆ సాయంకాలం యిల్లు చేరగానే రామి ఎదురుగా కనిపించింది పరిమళకి. దాంతో ఆవిడకి చిర్రెత్తిపోయింది. ఆవిడ కెదురుగానే వొంగి అదే మొండి చీపురుతో యింటిని తుడుస్తోంది రామి. దాని ఆ మౌనాన్ని భరించలేకపోయింది పరిమళ. అవమానభారంతో అడుగుల్ని భారంగా కదుపుతూ పడగ్గదిలోకి వెళ్ళిందామె.

రాత్రి పదవుతూండగా రెండుచేతుల్నీ ఊపుకుంటూ లోనికొస్తోన్న భర్తను చూడగానే పరిమళ కాస్తా సహనాన్ని కోల్పోయింది.

"యింతాలిస్యవయిందేవిటి ? ఎక్కణ్ణుంచొస్తున్నారు ?" విసుగ్గా ప్రశ్నించిందామె.

"మన సుబ్బారావు లేడూ ? వాడు పదిరోజులక్రితవే రిజర్వ్ చేసేడుట. వున్నట్టుండి వాళ్ళావిడ ఊరెళ్ళిపోవటంతో టికెట్ మిగిలిపోయిందంటూ బలవంతం చేస్తే వెళ్ళాను. 'ఎంటర్ ది డ్రాగన్' చూసొస్తున్నాను" అన్నాడు ప్రకాశరావు బూట్లని విప్పుకుండా.

అది వింటంతోనే పచ్చిపుండుపై కారం చల్లినట్లయింది పరిమళకి.

"యిద్దరమూ కలిసి ఆ సినిమా కెళ్లాలని ఎన్నాళ్ళుగా అనుకుంటున్నాం మనం ? టికెట్లు దొరకటం లేదని దాటవేసేరిన్నాళ్ళూ. యిపుడేమో చెప్పా చేయకుండా ఒంటరిగా వెళ్ళొస్తున్నారా ? అసలు నన్నొదిలి ఎలా వెళ్ళాలని తోచింది మీకు?" ఎగిరి పడింది పరిమళ.

"బలవంతం చేస్తేనే..." అంటూ ఏదో చెప్పబోయేడు ప్రకాశరావు.

"ఆపండి ! అన్నీ నంగనాచి కబుర్లు! రోజు రోజుకీ స్వార్థం మీలో పెరిగిపోతోంది. భార్యనే దొరకతుంది ! దాన్ని సుఖపెట్టాలన్న ఆలోచనొకటి మీకుంటేగా? నేనూ, పద్మజా కలిసి వెళ్ళాలనుకుంటే ఆ సినిమా కెన్నడో వెళ్ళే వాళ్ళం ! కాని మొగుడనేవారొకరున్నారనీ, కలిసి వెళ్ళాలనీ ఆగిపోయేను. ఆ ఆలోచనే మీకుండదని నాకేం తెలుసు ? యింతకీ చీపుర్లు కొనుక్కొచ్చేరా లేదా?"

పరిమళ ధోరణి ప్రకాశరావుకి చీకాకుని కలిగించింది.

"నీవూ, ఆ పద్మజా వెళ్ళి ఆ గంగలో దూకండి ! నేను బజారు కెళ్ళలేదు. చీపుర్లు తేవటం నాకు వీలవలేదు ! అయినా చీపురుకట్టల్ని నన్ను పట్రమ్మనటవేవిటి ? నీకు మతిపోయిందసలు !" కోపంతో లేచి వెళ్ళి బాత్‌రూంలోకి దూరేడతను.

అంతక్రితమే మనసు బాగుండని పరిమళకి, తీరా భర్త అలా ప్రవర్తించే సరికల్లా దుఃఖం ముంచుకువచ్చింది.

పదినిమిషాల తర్వాత యివతలి కొచ్చిన ప్రకాశరావు, భార్య మొహ

వంతా వాచిపోయి ముక్కు చీదుతూంటం గమనించి ఓ అడుగుని వెనక్కి వేసేడు. ఎటూ తోచలేదతనికి.

"ఆ చీపురుకట్టలేవిటో రామిచేత చెప్పి తెప్పించుకోకూడదూ? డబ్బులు పడేస్తే అదే తెస్తుంది!" ఏదో మాట్టాడాలనే ఉద్దేశ్యంతో వెనుకంజవేస్తూనే పలికేడతను.

అది వింటంతోనే పరిమళ రెచ్చిపోయింది.

"అవునవును! రామినే తెమ్మనండి! రేపట్నించి అన్నీ దాంతోనే తెప్పించుకోండి! వంటెలాగూ అదే చేస్తోంది. మిగతావన్నీ కూడా యిహ దాంతోనే చేయించుకోండి! దాన్ని నమ్మి దానికి డబ్బులిచ్చి సామాన్లన్నీ తెప్పిస్తే ఈపాటికి యిల్లు కాస్తా గుల్లయిపోయేది. రోజంతా అటు ఉద్యోగంతోనూ, యిటు యింటి పనులతోనూ ఛస్తున్నాను. మీకేవన్నా సానుభూతి అన్నది వుంటేగా? వెళ్ళండి! డబ్బులు దాని మొహాన పడేసి రండి!" అంటూ లేచి విసవిసా పడగ్గదిలోకి నడిచింది పరిమళ.

వంటగదిలోనుంచి వారి వాదనంతా వింది రామి. వండిన వంటకాల్ని బల్లపై సర్ది తన మానాన తాను వెళ్ళిపోయిందది.

ఆ రాత్రి బల్లమీది భోజనాలు అలాగే వుండిపోయేయి.

మర్నాడు ఆలస్యంగా నిద్రలేచిన ప్రకాశరావుకి యింట్లో అలికిడేమాత్రమూ వినిపించలేదు.

"పరిమళా!" కేకవేసేడతను.

"అమ్మగారిందాకే ఆఫీసుకెళ్ళేరండి!" వంటగదిలోనుంచి రామి గొంతు వినిపించటంతోనే ప్రకాశరావు వదనం కాస్తా ఆరిపోయింది. తొట్రుపాటుతో లేచి బాత్‌రూంలోకి అడుగులు వేసేడతను.

స్నానం ముగించి ముందుగదిలోకి రాగానే అపుడే లోనికొస్తున్న ఆఫీసు బంట్రోతు కనిపించేడతనికి.

ఆ సాయంకాలం తమ అమ్మాయి బారసాలకి కుటుంబయుక్తంగా రావలిసిందిగా ఆఫీసరుగారు పంపిన ఆహ్వానాన్ని అందుకున్నాడు ప్రకాశరావు

సాయంకాలం బాంకు మూసేక యివతలకి రావటంతోనే స్కూటర్‌తో ఎదురయిన భర్తని చూచి తలని త్రిప్పేసుకుంది పరిమళ.

"పరిమళా! యిలా వచ్చి కూర్చో! మా ఆఫీసరుగారింటి కెళ్ళాలి. వాళ్ళింట్లో బారసాల!" అన్నాడతను.

"మీరు వెళ్ళండి! నేను రాలేను. నా ఒంట్లో బావోలేదు. నేనింటి కెళ్ళాలి!" అంటూ తిరిగి అతనివంక చూడకుండానే బస్‌స్టాపువంక వెళ్ళబోయింది పరిమళ.

ప్రకాశరావది చూచి కోపంతో వణికిపోయేడు.



"డోంట్ బిహేవ్ స్టుపిడ్లీ! వచ్చి కూచుంటావా లేదా?" అరిచేడతను.

అతని ఆ అరుపుని విన్న బాటసారి ఒకరు ఆ దంపతులవంక వింతగా చూస్తూ ఆగిపోయేడు.

పరిమళకి తల తీసేసినట్లయిందది చూడటంతోనే.

"నన్ననవసరంగా విసిగించకండి! ఇది బజారు! అనవసరంగా అల్లరిపా లవుతాం! మీరు వెళ్ళండి!" అందామె మెల్లిగా.

ఆమె తీక్ష్ణదృష్టుల్ని ఎదుర్కోలేక పోయేడు ప్రకాశరావు దాంతో వెంటనే చల్లబడిపోయేడతను.

"యిది అల్లరికాదు పరిమళా! ప్రెస్టిజియస్ యిష్యూ! నీవు లేకుండా ఆ ఫంక్షన్‌కెళితే ఎలావుంటుందో నీవే చెప్పు? వాళ్ళంతా ఏమనుకుంటారు? రేపు ఆఫీసరుగారి ముందేమొహంతోనుంచోను? నా గురించి ఆ మాత్రం ఆలోచించ లేవూ?" అన్నాడతను లోగొంతుకతో.

"రాత్రి నేను లేకుండా సినిమాకెలా వెళ్ళేరు మీరు? నేను పనిమనిషిముందు పాడుబడ్డ చీపురుకట్టల విషయంలో తల వంపులు తెచ్చుకుంటూంటే మీకేవన్నా అనిపించిందా? ఉత్తచేతు లూపుకుంటూ అర్ధరాత్రిల్లు చేరలేదూ? యిదంతా మీరు నా గురించి ఆలోచించారు కదండీ? నన్ను నడిబజార్లో ఆట్టే విసిగించకండి! ఈవేళ కూడా చీపుర్లు కొనకుండా ఇంటి కెళ్ళి దానిముందు తలవంచుకోవటం నేను భరించలేను. నేను మార్కెట్ కెళ్ళాలి!" అంది పరిమళ.

"పరిమళా! ప్లీజ్! మనం వెళ్ళే పుడు కొనుక్కెడదాం! ఆలస్యం అవు తోందో ప్రక్క! యిలా వచ్చి కూచో! మరోసారి నీవు లేకుండా ఎక్కడకూ వెళ్ళను" దీనంగాపలికేడు ప్రకాశరావు.

అది వింటంతోనే ఆగిపోయిన బాట సారి కాస్తా ఫక్కుమంటూ నవ్వి వాళ్ళ వంకే చూస్తూ ముందుకు కదిలేడు.

అదిచూచి అటు ఆ వ్యక్తిపైనా, ఇటు

ప్రకాశరావుపైనా ఆగ్రహాన్ని నిలువెల్లా నింపుకుని యిహ చేసేదేమీలేక వచ్చి స్కూటరెక్కి కూచుంది పరిమళ.

ప్రకాశరావు స్కూటర్ని ముందుకు పోనిచ్చాడు. కాని అరమైలు దూరం వెళ్ళిందో లేదో ఆ బండి కాస్తా మొండి కేసి నుంచునిపోయింది. దాంతో రోడ్డు వారగా చేరిపోయి అరగంటసేపు నానా ప్రయత్నాలూ చేసి విసిగి ఫలితం లేక పోవటంతో దాన్ని ప్రక్కనే వున్న గ్యారేజీలో అప్పగించి వచ్చేడతను.

అంతవరకూ తన కోపాన్ని అతి కష్టంగా అణుచుకుంటూ రోడ్డుమీదే నుంచునిపోయిన పరిమళ కాస్తా ప్రకాశ రావు కేకవేసిన టాక్సీ వచ్చి ఆగటం తోనే లోన కూచోబోతూ తన విసుగు నంతా కూడా ఆ కారు తలుపుపైన చూపించింది.

పేరంటం ముగిసే వేళకు లోన కడు గిడిన వారి వంక అదోలా చూచేరు ఆఫీసరుగారు.

ప్రకాశరావు కథనం అంతా విన్నాక మాత్రం ఆయన తమ సానుభూతిని వ్యక్తపరచటమే కాకుండా వెళ్ళేపుడు తమ ప్రక్కనేవున్న ఓ మిత్రుడి కారులో వెళ్ళవలసిందిగా కోరేరాయన.

ఫంక్షన్ ముగిసేక ఆఫీసరుగారి మిత్రుడి కారు వెనకాలి సీటులో చేరగిల బడిపోతూన్న తరుణంలో చీపురుకట్టల విషయం గురించి భర్తకి జ్ఞాపకంచేసి దోవలోదిగి మార్కెట్ కెళదావంటూ కూచుంది పరిమళ.

ప్రకాశరావు యిబ్బందిగా కదిలేడు.

"పరిమళా! ప్లీజ్! రేపు కొందాం! కారుని మధ్యలో ఆపమంటం ఏం బావుం టుంది చెప్పు?" అన్నాడతను.

పరిమళకి మళ్ళీ కోపం ముంచుకు వచ్చింది. కాని ఆవిడకి వాదించడానికి అవకాశం యివ్వకుండానే కారు కాస్తా నిమిషాల్లో వారింటిముందు ఆగిపోయింది.

రిక్తహస్తాలతో లోనికొస్తోన్న పరి మళవంక అదోలా చూచింది రామి. ఆ చూపుని భరించలేకపోయింది పరిమళ.

"రేపు పొద్దున్నే లేచి బజారుకెళ్ళి నే పట్టుకొస్తానులేవోయ్! అనవసరంగా బాధపడకు!" పడగ్గదిలో భార్యను అనునయించేడు ప్రకాశరావు.

కాని మర్నాడు పొద్దున్నే నిద్రలేచి యివతలికి వచ్చిన పరిమళ వదనం కాస్తా పాలిపోయింది.

ఈ సారి రామి చూచిన చూపు పరి మళ నిద్రమత్తుని కాస్తా వదలగొట్టింది. తృణీకారభావం దాని కళ్లలో తొణికిస లాడింది

—నిలువెత్తు కొత్త పూలగుత్తుల చీపురుతో ముందు గదిని విసురుగా తుడుస్తోందది!!

* * *

"ఎలా వుందోయ్ చీపుర్లకథా?" స్నానం ముగించి గదిలోకి వస్తూ ప్రశ్నించేడు శ్రీనివాసమూర్తి.

"యిది కథెందుకవుతుందీ? మన ప్రక్కింటి వాళ్లగురించే వ్రాసుంటా డితను" అంటూ లేచేడు శ్రీకాంత్.